క్లుప్తంగా

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్ట్ చేశామన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

వేడుకగా సింహ వాహనోత్సవం



కొడవలూరు: మండలంలోని తలమంచిలో కొలువైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహ వాహనోత్సవం శుక్రవారం అత్యంత వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పూలంగిసేవ నిర్వహించారు. కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి వెలమ సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు విజయసాయిరెడ్డి, ప్రసన్న పర్యటన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పంచేడు గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటిస్తారని పార్టీ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన అనంతరం గ్రామంలోని డాక్టర్ సురేంద్రరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తారన్నారు. నేతల పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు.

యువత చేరిక

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన వంది మంది యువకులు ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మినీబైపాస్‌రోడ్డులోని ఆదాల కార్యాలయంలో యువకులకు ఆ పార్టీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ముందుకొచ్చిన యువకులను మనస్ఫూర్తిగా అభినందిస్తూ భవిష్యత్తులో ఎటువంటి సమస్య వచ్చినా అండగా ఉంటానని ఆదాల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాళెం సుధీర్ కుమార్‌రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ ఒట్టూరు సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- కొమరపూడికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. కొమరపూడిలో పర్యటించిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, కొమరపూడి నాయకులు నెట్టెం శ్రీధర్‌రెడ్డి, గట్టుపల్లి ప్రసాద్, చంద్రగిరి చిన్నయ్య, ముత్తంగి వెంకటేశ్వర్లు, సుధాకర్, వల్లభనేని రమణమ్మ, కందమూరు ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(టౌన్): నెల్లూరు రూరల్ పరిధిలోని కొండ్లపూడిలో డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే వాసన్ ఐ కేర్ వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఉమామహేశ్వరి, దివ్య, ప్రియాంక, నారాయణరెడ్డి, పీఆర్వో జోజి, తదితరులు పాల్గొన్నారు.

రేపు శంకరమఠంలో చండీ హోమం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆ మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనే..



పార్టీలో చేరిన రామచంద్రాపురం నాయకులతో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ గెలుస్తుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవుతారు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరులో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పార్టీ కార్యకర్తలు, నేతల అభిప్రాయాన్ని తెలుసుకోకుండా కొంతమందిని చేర్చుకుని తప్పు చేశానన్నారు. ఇప్పుడు వారందరితో టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బేరం పెట్టారన్నారు. రూ.కోట్లు ఇస్తామని చెప్పడంతో కొందరు వైఎస్సార్‌సీపీకి ద్రోహం చేసి తెలుగుదేశంలో చేరేందుకు సిద్ధమయ్యారన్నారు. వాళ్లు వెళ్తే తమకేమీ నష్టం లేదన్నారు. ప్రజలు, కార్యకర్తలే తన బలమన్నారు. అలాంటి వ్యక్తులను పార్టీలో చేర్చుకున్నందుకు క్షమాపణలు కోరుతున్నట్లు చెప్పారు. అండగా నిలిస్తే వేమిరెడ్డి డబ్బులకు అమ్ముడుపోయిన వారిని ఇక దగ్గరకు రానివ్వని తెలిపారు. జొన్నవాడ కామాక్షమ్మ సాక్షిగా చెబుతున్నానన్నారు.

పార్టీలో చేరిక

విడవలూరు: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పాతూరు గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 70 మంది శుక్రవారం విడవలూరులో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే ఆంజనేయపురం గ్రామానికి చెందిన 50 మంది వ్యక్తులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ తమది ఇతర పార్టీ అని తెలిసినా ఐదు సంవత్సరాలు సంక్షేమ పథకాలు అందించారన్నారు. వైఎస్ జగన్ రెండోసారి సీఎం అయితేనే మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు.

టీడీపీ నుంచి కొనసాగుతున్న వలసలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. మండలంలోని అక్కంపేట గ్రామంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాల వారు శుక్రవారం నెల్లూరులోని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మంత్రి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనను చూసి తెలుగుదేశం వారు స్వచ్ఛందంగా తమ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మరోసారి ఓటమి తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకుడు దాసరి భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి

- సీనియర్ సివిల్ జడ్జి వాణి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నీటి వృథాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగమాంబాపురం గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నీటి వనరులను పొదుపుగా వాడాలన్నారు. వృథాను అరికట్టకపోతే సంక్షోభం తప్పదని హెచ్చరించారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది ప్రజలకు మంచినీరు దొరకడం లేదన్న విషయాన్ని గమనించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై జాకీర్ బాషా, సర్పంచ్ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి వాణి

ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ..

వెంకటాచలం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విద్యా ప్రభాకర్ సూచించారు. మండలంలోని కాకుటూరు గ్రామంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్, అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



వెంకటాచలం మండలం కాకుటూరులో..

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని కొడవలూరు వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని గౌతమ్ నగర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. దీంతో రక్తహీనత, ఇతర సమస్యలు నివారించబడుతాయన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహారంపై అవగాహన ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరైతే ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణ, ప్రియాంక, స్వాతి, సంధ్య, ఏఎన్ఎం విశలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రాధిక, బి.ప్రియదర్శిని, పి.రమ, కె.సునీత, కె.ఎస్తేరమ్మ, పి.మధుసూదనమ్మ, ఎ.అనూరాధ, ఎ.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.



గౌతమ్‌నగర్‌లో అవగాహన ర్యాలీ

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓటేయాలని పట్టణంలోని 16 వార్డు కౌన్సిలర్ ప్రమీలమ్మ కోరారు. శుక్రవారం ఆమె 16వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



కరపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ ప్రమీలమ్మ

దుకాణాల వద్ద చెత్తబుట్టలు తప్పనిసరి

నెల్లూరు(బారకాసు): దుకాణాల వద్ద వ్యాపారులు చెత్తబుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ సూచించారు. నగరంలోని సంతపేట, హరనాథపురం, బాలాజీనగర్, రాంజీనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల నిర్వాహకులకు సూచనలు చేశారు. దుకాణాల వద్ద చెత్త బుట్టలను ఏర్పాటు చేసి కొనుగోలుదారులు వాటిని వినియోగించేలా చూడాలన్నారు. చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడే వ్యర్థాలను అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని రోడ్లపై సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న పశువులను కల్లూరుపల్లి గోశాలకు తరలిస్తున్నామని తెలిపారు. రోడ్లపైకి పశువులను వదిలితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రంజాన్ ఉపవాస దీక్షలను దృష్టిలో ఉంచుకుని నగరంలోని అన్ని మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం 22వ డివిజన్ బ్యాంక్ కాలనీలో శానిటేషన్ సూపర్‌వైజర్ శేషయ్య ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని దుకాణాల నిర్వాహకులకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో కమిషనర్ మాట్లాడారు. ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉన్న ఆస్తి పన్ను బకాయిలను ఈ నెలాఖరులోగా ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా ఉంటుందన్నారు. నగర ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు సమన్వయంతో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేసి ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించారు. భారీ మొత్తంలో బకాయిల ఉన్న వారి వివరాలను తెలియజేస్తే తానే ప్రత్యక్షంగా వచ్చి వసూలు చేస్తానని స్పష్టం చేశారు. తాగునీటి కుళాయిలు, డ్రైనేజీ పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని అమెనిటీస్ కార్యదర్శులకు సూచించారు. కుళాయి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులను గుర్తించి కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ సంతోష్‌కుమార్, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమ్మద్, రాజేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కృష్ణంరాజు, కృష్ణకిషోర్, కృపాకర్, శ్రీనివాసులు, పెంచలయ్య, రవి, పద్మ, అజయ్, సునీల్, చిన బాబు పాల్గొన్నారు.

కాకాణి విజయం కోసం పాదయాత్ర నేడు

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మూడో పర్యాయం సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని పొదలకూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం గొలగమూడి ఆశ్రమం వరకు పాదయాత్ర చేస్తారని ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు పట్టణం నుంచి పాదయాత్ర మొదలవుతుందన్నారు. పాలిచర్లపాడు, కసుమూరు, వెంకటాచలం మీదుగా సాయంత్రం 7 గంటలకు గొలగమూడి చేరుకుంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శుక్రవారం జరిగింది. వివరాలు.. నార్తురాజుపాళేనికి చెందిన దినేష్ పని నిమిత్తం మోటార్‌బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి వెళ్తుండగా, సర్వేపల్లి కాలువ సమీపంలో ఎదురుగా ఆటో అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో దినేష్‌కు గాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25న అయ్యప్ప స్వామికి పూజలు

పొదలకూరు: స్థానిక శివాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈనెల 25వ తేదీన పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ మొలబంటి శేఖర్ బాబు, సెక్రటరీ చొప్పా వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం పూజలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

కోవూరు: దీర్ఘకాలిక రోగాలతో బాధలు పడుతున్న వారు వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని సచివాలయం-3 ప్రాంతంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ వ్యాయామం చేయాలన్నారు.

విద్యార్థులకు సదస్సు

కోవూరు: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డిగ్రీ కళాశాల, గుమ్మళ్లదిబ్బ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తదితర చోట్ల శుక్రవారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం తదితర లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రధానంగా మనిషిలో రోగ నిరోధక శక్తి తగ్గినప్పుడే ఇటువంటి వ్యాధులు సోకే అవకాశం ఉంటుందన్నారు.

పాటూరులో ఎన్నికల ప్రచారం

కోవూరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని డీఏఏబీ చైర్మన్ దొడ్డం నిరంజన్‌బాబురెడ్డి కోరారు. మండలంలోని పాటూరు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు విజయసేనారెడ్డి, మధురెడ్డి, సుధాకర్‌రెడ్డి, కేత మల్లికార్జున్, ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- కోవూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రాధాకృష్ణారెడ్డి అతిథి గృహం వద్ద శనివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం జరుగుతుందని నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు హాజరుకావాలన్నారు.



ప్రచారం చేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

వైభవంగా గరుడసేవ

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణీదేవి సమేత పాండురంగ స్వామి 49వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం విశేష పూజలు, రాత్రి గరుడసేవ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- ఎస్సీకాలనీలో అత్యంత వైభవంగా రుక్మిణీదేవి సమేత పాండు రంగస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు జరిగాయి.
- ఇందుకూరుపేట: మండల కేంద్రంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఉదయగిరి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఉభయకర్తగా జొన్నలగడ్డ మధుసూదన్‌రావు వ్యవహరించారు. ఉదయం స్వామికి మోహినీ అలంకారంలో ఉత్సవం జరిగింది. మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామిని భక్తులు దర్శించుకున్నారు.



ఇందుకూరుపేట: మోహినీ అలంకారంలో..

మైనార్టీలకు అండగా సీఎం జగన్

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీలకు ఎల్లవేళలా అండగా ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా ముత్తుకూరులో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు. వారితో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, ఆయన తనయుడు జగన్ రాజ్యాధికారం వైపు నడిపించారన్నారు. ముస్లింల కోరిక మేరకు ముత్తుకూరులో ఈద్గా మైదానాన్ని అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు అబ్దుల్ రహీం, షేక్ నవీద్, మున్నా తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి కాకాణి

సీజనల్ వ్యాధులపై అవగాహన

- డాక్టర్ కిరణ్ రిషిత

పొదలకూరు: విద్యార్థినులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పొదలకూరు కో–లోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రిషిత సూచించారు. పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో శుక్రవారం క్షయ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే తీసుకోవాలన్నారు. శుద్ధి చేసి లేదా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు కామాక్షమ్మ, అరుణ, వెంకటేశ్వర్లు, ఆశావర్కర్లు రమణమ్మ, పెంచలమ్మ, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ రిషిత

మంత్రి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నేడు

ముత్తుకూరు: మండలంలోని పైనాపురం, నేలటూరు పంచాయతీల్లో శనివారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కేంద్ర బలగాలు, పోలీసుల కవాతు

ముత్తుకూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీల్లో శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కేంద్ర బృందం సుమారు 50 మందికిపైగా స్థానిక పోలీసులతో కలిసి కవాతు చేశారు. అన్ని ప్రధాన వీధుల్లో చేసి, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి, ఎస్సైలు శ్రీనివాసరెడ్డి, శివనాంచారయ్య పాల్గొన్నారు.



గ్రామ పంచాయతి కార్యాలయం - వెంకన్నపాలెం

టెండరు ప్రకటన — తేది : 22-03-2024

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, మనుబోలు మండలం, వెంకన్నపాలెం పంచాయతి నందు తేది 01-04-2024 నుండి తేది 31-03-2025 వరకు (2024-25వ ఆర్థిక సంవత్సరమునకు) వివిధ సేవలు నిర్వహించుటకు గాను ప్రతిరోజు సిబ్బందిని సమకూర్చుటకు అనర్హత కాంట్రాక్టుదారుల నుండి తేది. 30-03-2024 శనివారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండరు దాఖలు చేయువారు క్రింద తెలిపిన విధముగా ధరావత్తు చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. నిబంధనలు మరియు వివరములు కార్యాలయ పనివేళలందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు రూ॥లలో
1.	పంచాయతి ఆఫీస్ స్వీపరు-1 (ఒక్కరు)	1000-00
2.	పి.డబ్ల్యు.యస్ పంపు ఆపరేటర్లు -2(ఇద్దరు)	
	మొత్తం -3(ముగ్గురు)	

సం/- పంచాయతి సెక్రటరి, వెంకన్నపాలెం గ్రామ పంచాయతి, మనుబోలు (మం).

గ్రామ పంచాయతి కార్యాలయం - బద్దెవోలు

టెండరు ప్రకటన — తేది : 22-03-2024

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, మనుబోలు మండలం, బద్దెవోలు పంచాయతి నందు తేది 01-04-2024 నుండి తేది 31-03-2025 వరకు (2024-25వ ఆర్థిక సంవత్సరమునకు) వివిధ సేవలు నిర్వహించుటకు గాను ప్రతిరోజు సిబ్బందిని సమకూర్చుటకు అనర్హత కాంట్రాక్టుదారుల నుండి తేది. 30-03-2024 శనివారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండరు దాఖలు చేయువారు క్రింద తెలిపిన విధముగా ధరావత్తు చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. నిబంధనలు మరియు వివరములు కార్యాలయ పనివేళలందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు రూ॥లలో
1.	పంచాయతి ఆఫీస్ స్వీపరు-1 (ఒక్కరు)	1000-00
2.	పి.డబ్ల్యు.యస్ పంపు ఆపరేటర్లు -2(ఇద్దరు)	
	మొత్తం -3(ముగ్గురు)	

సం/- పంచాయతి సెక్రటరి, బద్దెవోలు గ్రామ పంచాయతి, మనుబోలు (మం).